జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం | 24 | మే | 2026 ◆ పేజీలు : 7


# పల్లె వాతావరణం కనువిందు చేసే గ్రామాలను గుర్తించండి

- గిరిజన గ్రామాల్లో రాత్రి బస అనుకూలకంగా పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలి
- వీడియో కాన్ఫరెన్సులో రాష్ట్ర పర్యాటక ప్రత్యేక కార్యదర్శి వాణి ప్రసాద్



**భద్రాచలం టౌన్, మే 23 ప్రజాజ్యోతి** పర్యాటకశాఖ తరపున గిరిజన గ్రామాలలో పర్యాటకులు ఎక్కువ శాతం పర్యటన చేసే గ్రామాలు పూర్తి స్థాయి పల్లె వాతావరణం కనువిందు కలిగేలా ఉండే గిరిజన గ్రామాలు,

మిగతా 2 లో...



# మార్కెట్ వాల్యూ అప్ డేషన్ వేగవంతం చేయాలి

- ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ లోకేష్ కుమార్
- ఫామ్ 1,2,3,4 అప్డేషన్ త్వరితగతిన చేపట్టాలి

**కొత్తగూడెం కలెక్టరేట్, మే 23,(ప్రజా జ్యోతి)** హైదరాబాద్ నుండి చీఫ్ కమిషనర్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ లోకేష్ కుమార్ , రెవెన్యూ శాఖ రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ ప్రత్యేక కార్యదర్శి రాజీవ్ గాంధీ హనుమంతు అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మార్కెట్ వాల్యూ అప్డేషన్ పై శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా మార్కెట్ వాల్యూ అప్డేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అదేవిధంగా భూభారతి ఐజీఆర్ఎస్ పోర్టల్ లో ఫామ్ 1, 2, 3, 4లకు సంబంధించిన అప్డేషన్ ప్రక్రియను వేగవంతంగా చేపట్టాలని సూచించారు.జీవో నెంబర్ 44 ప్రకారం జిల్లా స్థాయి నుండి మండల స్థాయి వరకు కమిటీలను ఏర్పాటు చేసి మార్కెట్ వాల్యూ సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. భూ లావాదేవీలు

మిగతా 2 లో...

## జగన్నాధపురంలో జుగుప్సాకర ఘటన

# కన్నతల్లిపైనే కామాంధుడి వికృత చేష్టలు

- అర్ధరాత్రి ఇంట్లోనే అమానుష యత్నం
- తల్లి కేకలతో పరుగెత్తుకొచ్చిన స్థానికులు
- నిందితుడిని పట్టుకొని పోలీసులకు అప్పగింత
- జగన్నాధపురంలో కలకలం... ప్రజల్లో తీవ్ర ఆగ్రహం



**పాల్వంచ, మే 23 (ప్రజాజ్యోతి )** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని జగన్నాధపురంలో సభ్య సమాజం తలదించుకునే జుగుప్సాకర ఘటన చోటుచేసుకుంది. కన్నతల్లి అని కూడా చూడకుండా అర్ధరాత్రి సమయంలో ఓ కామాంధుడు వికృతానికి తెగబడిన ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం రేపింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... అర్ధరాత్రి సమయంలో ఇంట్లో నిద్రిస్తున్న తల్లిపై ఆమె కుమారుడే దారుణంగా దాడి చేసి లైంగిక వేధింపులకు ప్రయత్నించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అకస్మాత్తుగా జరిగిన ఘటనతో భయాందోళనకు గురైన బాధిత మహిళ ప్రాణభయంతో గట్టిగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు అప్రమత్తమయ్యారు. మహిళ అరుపులు విని వెంటనే అక్కడికి చేరుకున్న స్థానికులు నిందితుడుని అదుపులోకి తీసుకొని బాధితురాలిని రక్షించారు. అనంతరం నిందితుడిని

మిగతా 2 లో...

# ఉల్వనూరు పీహెచ్ సీ పై డీఎంహెచ్ వో ఆకస్మిక తనిఖీ

- గైర్హాజరు సిబ్బందికి మెమోలు
- రికార్డుల నిర్వహణలో లోపాలపై ఆగ్రహం



**పాల్వంచ, మే 23, ప్రజాజ్యోతి:** పాల్వంచ మండలం ఉల్వనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి (డీఎం హెచ్ వో) డాక్టర్ తుకారం రాథోడ్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విధులకు గైర్హాజరైన వైద్యుడు, సిబ్బందిపై చర్యలు తీసుకుంటూ మెమోలు జారీ చేశారు.తనిఖీల్లో విధులకు హాజరు కాని డాక్టర్ దేవేందర్, హెల్త్ సూపర్వైజర్ భీమ్ సింగ్, సీనియర్ అసిస్టెంట్ బుచ్చయ్యలకు మెమోలు జారీ చేసినట్లు తెలిపారు. అలాగే మందుల నిల్వల రిజిస్టర్ ను సక్రమంగా నవీకరించకపోవడంపై ఫార్మసీ ఆఫీసర్ రోజా రమణికి, రికార్డులు,

మిగతా 2 లో...

# తలరాత.. మారేనా..?

- కల్వర్ట్ నే ఆశ్రయంగా మార్చుకున్న అభాగ్యురాలు
- మహిళకు సర్కార్ చేయూత దక్కేనా..?
- సురక్షిత ఆశ్రయం లభించేనా..?



**చర్ల, మే 23 :(ప్రజా జ్యోతి):** చర్ల మండలంలో ఓ మహిళ జీవిస్తున్న దయనీయ పరిస్థితి స్థానికులను కలచివేస్తోంది. రహదారి పక్కనున్న కల్వర్ట్ ను ఆశ్రయంగా చేసుకుని జీవిస్తున్న ఆ మహిళ పరిస్థితి చూస్తే ఎవరికైనా హృదయం కదిలేలా ఉంది. ఎవరికీ ఎవరు పట్టని ఈ కాలంలో ఆమె మాత్రం తన బాధను మౌనంగా మోస్తూ రోజులు గడుపుతోంది.స్థానికుల కథనం ప్రకారం, ఇతర రాష్ట్రానికి చెందిన ఆ మహిళకు తెలుగు భాష రాదు అని మాట్లాడేందుకు ప్రయత్నించినా ఎవరూ అర్థం చేసుకోలేని పరిస్థితి అని చేతులతో సంకేతాలు చేస్తూ ఏదో చెప్పాలని ప్రయత్నించినా తన బాధను పూర్తిగా వ్యక్తం చేయలేక మౌనంగా

మిగతా 2 లో...

## కన్నతల్లిపైనే కామాంధుడి వికృత చేష్టలు

(మొదటి పేజీ తరువాయి...)

ఆటోలో కట్టి పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు సమాచారం. వయసు మళ్ళిన కన్నతల్లిపై కుమారుడు చేసిన దారుణ ఘటన విషయం తెలిసిన వెంటనే జగన్నాధపురం ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఇలాంటి దారుణాలకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## మార్కెట్ వాల్యూ అప్డేషన్ వేగవంతం చేయాలి

(మొదటి పేజీ తరువాయి...)

, రిజిస్ట్రేషన్ వ్యవస్థలో పారదర్శకత పెంపుతో పాటు ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు ఈ ప్రక్రియను సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఐడీఓసీ కార్యాలయం నుండి జిల్లా కలెక్టర్ అంకిత్ అదనపు కలెక్టర్ వేణుగోపాల్ తో కలిసి పాల్గొన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ఉన్న 379 రెవెన్యూ గ్రామాలలో మార్కెట్ వాల్యూ అప్డేషన్ ప్రక్రియను నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. రెవెన్యూ, రిజిస్ట్రేషన్ , సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి భూభారతి, ఐజీఆర్ఎస్ అప్డేషన్లను వేగవంతం చేయాలని సూచించారు.ఈ సమావేశంలో డిఆర్ఓ పద్మావతి, కొత్తగూడెం ఆర్డీవో మధు, ఈ డిస్టిక్ మేనేజర్ సైదేశ్వరరావు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు

## పల్లె వాతావరణం కనువిందు చేసే గ్రామాలను గుర్తించండి

(మొదటి పేజీ తరువాయి...)

రాత్రి బస చేసే విధంగా ఉండే గ్రామాలు గుర్తించి పర్యాటక అభివృద్ధికి ప్రతిపాదనలు పంపాలని రాష్ట్ర పర్యాటక ప్రత్యేక కార్యదర్శి వాణి ప్రసాద్ సంబంధిత అధికారులకు ఆదేశించారు. శనివారం హైదరాబాదులోని పర్యాటక శాఖ కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్, ఐటిడిఏ పీవోలతో ధర్తీ జుగా కింద గిరిజన ప్రాంతాలలో హోమ్ స్టేల అభివృద్ధి క్రింద ప్రాజెక్టు అమలు, పర్యవేక్షణ కోసం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.ఈవీడియో కాన్ఫరెన్స్ లో గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్ సంతోష్, అడిషనల్ సెక్రటరీ సర్వేశ్వర్ రెడ్డి, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పర్యాటక శాఖ ప్రత్యేక కార్యదర్శి వాణి ప్రసాద్ మాట్లాడుతూ పల్లె వాతావరణం ఉట్టిపడేలా ఉండే గ్రామాల్లో రాత్రి బస చేయడానికి అనుకూలం ఉండేవి, ముఖ్యంగా గ్రామాల్లో వాటర్‌ఫాల్స్, దేవాలయాలు, గిరిజన సంస్కృతి, గిరిజనులు తయారు చేసే వివిధ ఉత్పత్తులు ఉండేలా గ్రామాలను గుర్తించాలన్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు ఈనెల 28 వరకు పర్యాటక శాఖకు పంపించాలని అధికారులకు ఆదేశించారు. కొత్తగూడెం జిల్లాలోని భద్రాచలంలో శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానం ఉందని, భక్తులతో పాటు పర్యాటకులు ప్రతిరోజు అధికంగా దేవస్థానం దర్శనంనకు వస్తూ ఉంటారని, అలాగే గిరిజన గ్రామాలలో పర్యాటక స్థలాలను గుర్తించడానికి త్వరలో సంబంధిత అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి పర్యాటక స్థలాలు మారుమూల ప్రాంతాలలోని బెండలపాడు, కిన్నెరసాని, గోగుల పూడి, బొజ్జిగుప్ప గ్రామాల గురించి అధికారుల సూచనల ద్వారా ప్రతిపాదనలు తయారుచేసి సమర్పిస్తామని ఐటిడిఏ పిఓ బి రాహుల్ సెక్రెటరీ కి తెలిపారు. ఈ కార్యక్రమంలో సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎండదెబ్బతో భవన నిర్మాణ కార్మికుడు మృతి

- కరకవాగు గ్రామంలో విషాదం



**పాల్వంచ, మే 23, ప్రజాజ్యోతి:** పాల్వంచ పట్టణ పరిధిలోని 34వ డివిజన్ కరకవాగు గ్రామానికి చెందిన భవన నిర్మాణ కార్మికుడు పులి వెంకటేశ్వరరావు ఎండదెబ్బకు గురై మృతి చెందాడు. శనివారం ఉదయం తీవ్ర ఎండ ప్రభావంతో అస్వస్థతకు గురైన ఆయనకు వాంతులు అధికంగా కావడంతో అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. భవన నిర్మాణ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్న వెంకటేశ్వరరావు ఆకస్మిక మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఎండదెబ్బతో జరిగిన ఈ ఘటన స్థానికులను తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసింది. మృతుడికి భార్య, తల్లి ఉన్నారు. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించగా గ్రామస్తులు వారికి ధైర్యం చెప్పారు. వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని స్థానికులు సూచిస్తున్నారు.

# తలరాత.. మారేనా..?



(మొదటి పేజీ తరువాయి...)

ఉండిపోతుంది అని అంటున్నారు.ఆమె పేరు ఏమిటి..? ఎక్కడి నుంచి వచ్చింది..? కుటుంబ సభ్యులు ఎవరైనా ఉన్నారా..? అనే ప్రశ్నలకు కూడా సమాధానాలు చెప్పే స్థితిలో ఆమె కనిపించటం లేదు. కొంతకాలంగా చర్ల మండలంలోని ఆయిల్ బంక్ సమీపంలోని రహదారి పక్క కల్వర్ట్‌నే ఆశ్రయంగా మార్చుకుని జీవిస్తోంది. అదే ఆమెకు ఇల్లు, పడక గది.. అదే రక్షణ. ఎండ మండుతున్నా, వర్షం కురిసినా ఆ కల్వర్ట్ పై జీవనం గడుపుతోంది. చూసేవారికి అది సాధారణ కల్వర్ట్ కావొచ్చు.. కానీ ఆమెకు మాత్రం అదే ప్రపంచమైపోయింది.ఆమె మానసిక సమస్యలతో బాధపడుతున్నట్లు కనిపిస్తోందని స్థానికులు చెబుతున్నారు. ఎవరితోనూ సరిగా మాట్లాడకుండా కొన్నిసార్లు ఒంటరిగా నవ్వుకోవడం, మరి కొన్ని సార్లు నిశ్శబ్దంగా ఆకాశం వైపు చూస్తూ ఉండడం కనిపిస్తోందని అంటున్నారు. ఆమె మనసులో ఎంత బాధ దాగి ఉందో ఎవరికీ తెలియదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆకలేస్తే స్థానికులు లేదా దారిన వెళ్లే ప్రయాణికులు కనికరంతో ఇచ్చే ఆహారమే ఆమెకు ఆధారం. ఎవరో ఒకరు అన్నం పెడితే తింటుంది నీళ్లు ఇస్తే తాగుతుంది కొన్నిరోజులైతే సరైన భోజనం కూడా దొరకని పరిస్థితి ఉంటోందని చెబుతున్నారు. కొందరు బట్టలు ఇచ్చినా అవి కూడా శాశ్వతం కావని అంటున్నారు. ఆమెకు అవసరమైనది కేవలం ఒకపూట భోజనం కాదు ఒక భద్రమైన జీవితం అని మండల వాసులు పేర్కొంటున్నారు.ప్రస్తుతం స్థానికులను ఎక్కువగా కలవరపెడుతున్న విషయం ఆమె భద్రత ఈ కాలంలో మహిళలు ఇంట్లోనే భయపడుతున్న పరిస్థితుల్లో ఓ మహిళ రోడ్డుపై ఒంటరిగా జీవించడం ఎంత ప్రమాదకరమో అర్థం చేసుకోవచ్చని వారు అంటున్నారు. అనుకోని పరిస్థితులే ఆమెను ఇలా రోడ్డుపైకి తీసుకొచ్చి ఉండొచ్చని భావిస్తున్నారు.స్థానిక యువకులు, సామాజిక కార్యకర్తలు ముందుకు వచ్చి ఆమెకు సహాయం చేయాలని కోరుతున్నారు. ప్రభుత్వ అధికారులు స్పందించి అవసరమైతే వైద్య పరీక్షలు నిర్వహించి, మానసిక ఆరోగ్య చికిత్స అందించాలని సూచిస్తున్నారు. అలాగే ప్రభుత్వం ఆధ్వర్యంలోని ఆశ్రయ గృహాలు, వృద్ధాశ్రమాలు లేదా సేవా సంస్థల ద్వారా ఆమెకు సురక్షిత ఆశ్రయం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, సేవా సంఘాలు, దాతలు, మంచి మనసున్న వ్యక్తులు ముందుకు రావాలని స్థానికులు కోరుతున్నారు. సోషల్ మీడియాలో ఫోటోలు పెట్టి బాధపడటం మాత్రమే కాకుండా నిజంగా ఒక జీవితం కాపాడే ప్రయత్నం చేయాలని, ఆమెకు ఆశ్రయం కల్పిస్తే అదే పెద్ద మానవత్వమని పలువురు అభిప్రాయపడుతున్నారు. చర్ల మండల ప్రజలు ఇప్పుడు ఒక్కటే ఆశతో ఎదురుచూస్తున్నారు ఎవరో ఒకరు ముందుకు వచ్చి ఆ మహిళ జీవితంలో వెలుగు నింపుతారని ఎప్పుడో ఒకరోజు ఆమె కూడా భయంలేని జీవితాన్ని గడుపుతుందని ఆ కల్వర్ట్ నుంచి బయటపడి కనీసం ఒక సురక్షిత గదిలో నిద్రిస్తుందని ఆశిస్తున్నారు. ప్రస్తుతం ఆ మహిళ జీవితం చర్ల మండలంలో మానవత్వాన్ని ప్రశ్నించే ఘటనగా మారింది ఆమెకు చేయూతనివ్వడానికి ఒక మంచి మనసు ముందుకు వస్తుందా..? ప్రభుత్వం స్పందించి ఆ అభాగ్యురాలికి రక్షణ కల్పిస్తుందా..? ఆమె "తలరాత ..మారేనా" అని..ఇలాంటి మరెందరో అభాగ్యుల అంధకార జీవితాల్లో వెలుగులు నిండాలని మండల ప్రజలు ఆశిస్తున్నారు.

## ఉల్వనూరు పీహెచ్ సీ పై డీఎంహెచ్వో ఆకస్మిక తనిఖీ

(మొదటి పేజీ తరువాయి...)





రిజిస్టర్లు సరిగా నిర్వహించకపోవడంతో నర్సింగ్ ఆఫీసర్ సంధ్యారాణికి మెమోలు జారీ చేశారు.పేషెంట్లకు స్టెరాయిడ్ ఇంజెక్షన్లు ఇస్తున్న ఎంఎల్ హెచ్ పీ, నర్సింగ్ ఆఫీసర్ వ్యవహారంపై కూడా ఆగ్రహం వ్యక్తం చేస్తూ వివరణ కోరినట్లు సమాచారం. పీహెచ్ సీ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, ప్రతి నెల మూడో గురువారం శ్రమదానం, సమిష్టి భోజన కార్యక్రమాలు నిర్వహించి పరిసరాల్లోని చెత్తను తొలగించాలని సూచించారు.ఈ సందర్భంగా ఫార్మసీ, ల్యాబొరేటరీ, వార్డులు, లేబర్ రూమ్ ను పరిశీలించిన డీఎంహెచ్ వో, అత్యవసర మందుల నిల్వలను బోర్డుపై స్పష్టంగా ప్రదర్శించాలని ఫార్మసిస్టుకు ఆదేశించారు. పాముకాటు, తేలుకాటు, కుక్కకాటు మందులు, ఓఆర్ ఎస్ ప్యాకెట్లు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని సూచించారు. చిన్నారులకు వేసే టీకాల నిల్వలపై కూడా ఆరా తీశారు.అనంతరం కారేగట్టు గ్రామంలో నిర్వహిస్తున్న రొటీన్ ఇమ్యూనైజేషన్ కార్యక్రమాన్ని తనిఖీ చేసి గర్భిణీలకు అందుతున్న సేవలను పరిశీలించారు. రక్తహీనత తగ్గించేందుకు సమతుల ఆహారం, చిన్నచిన్న వ్యాయామాలు, యోగా చేయాలని, క్రమం తప్పకుండా వైద్యుల పర్యవేక్షణలో చెకప్ లు చేయించుకోవాలని గర్భిణీలకు సూచించారు. వ్యాధి నిరోధక టీకాల ప్రాముఖ్యతపై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సిబ్బందిని ఆదేశించారు. అదేవిధంగా ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ లలో ఎంఎల్ హెచ్ పీలు ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు సేవలు అందించాలని, ప్రతిరోజూ హెల్త్ అండ్ వెల్ నెస్ కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం ఉల్వనూరు పీహెచ్ సీలోని 108 వాహనంలో మందులు, ఆక్సిజన్ సిలిండర్, బీపీ పరికరాలు తదితర అత్యవసర సదుపాయాలను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో డాక్టర్ ప్రతాప్ (ప్రోగ్రాం ఆఫీసర్), రాంప్రసాద్ (హెచ్ ఈఓ), వినయ్ కుమార్ (ఎంఎల్ హెచ్ పీ), సదాల దేవి (హెచ్ వీ), జ్యోతి, సంధ్యారాణి, రోజా రమణి తదితరులు పాల్గొన్నారు.

## గోదాములకు మొక్కజొన్న తరలింపు వేగవంతం చేయాలి..

- పీహెచ్ సీల్లో వైద్యులు అందుబాటులో ఉండాలి: జిల్లా కలెక్టర్ అంకిత్





**ఆళ్లపల్లి. మే23. ప్రజా జ్యోతి** ఆళ్లపల్లి మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని (PHC) జిల్లా కలెక్టర్ అంకిత్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. కేంద్రంలో ఉన్న 117 మెట్రిక్ టన్నుల మొక్కజొన్న నిల్వలను ఎక్కువకాలం ఉంచకుండా, వెంటనే గోదాములకు తరలించాలని ఆదేశించారు. హమాలీలు, లారీల కొరత లేకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలన్నారు. అకాల వర్షాల నేపథ్యంలో నిల్వలు తడవకుండా రక్షణ చర్యలు చేపట్టాలని, రైతులకు తాగునీరు, నీడ సదుపాయాలు కల్పించి, చెల్లింపులు త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ సమయంలో మెడికల్ ఆఫీసర్ తరుణ్ అందుబాటులో లేకపోవడంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. దీనిపై పూర్తి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించారు. ఎండ తీవ్రత దృష్ట్యా వడదెబ్బ బాధితుల కోసం అవసరమైన మందులు, ఐవీ ఫ్లూయిడ్స్, పడకలను సిద్ధంగా ఉంచాలన్నారు.వైద్యులు, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహించకుండా, సమయపాలన పాటిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో తహసీల్దార్ ఉషారాణి, పీహెచ్‌సీ సిబ్బంది మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పొగాకు వల్ల అనారోగ్య సమస్యలు



**ఇల్లందు, మే 23, ప్రజాజ్యోతి:** పొగాకు వినియోగం వల్ల అనారోగ్య సమస్యల వచ్చే అవకాశం ఉందని ఇల్లందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి స్వరూప కాటం తెలిపారు. శనివారం కోర్టు ఆవరణలో జరిగిన న్యాయ చైతన్య సదస్సులో భాగంగా ప్రపంచ పొగాకు నివారణ దినోత్సవం, మానవ అక్రమ రవాణా పై అవగాహనా కల్పించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ప్రతి సంవత్సరం మే 31న ప్రపంచవ్యాప్తంగా ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహిస్తారన్నారు. పొగాకు వినియోగం వల్ల కలిగే ఆరోగ్య సమస్యలు, ప్రాణనష్టంపై ప్రపంచ ఆరోగ్య సంస్థ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు చేపడతారని పేర్కొన్నారు. పొగాకు వాడకం ద్వారా మానవ శరీరానికి జరిగే తీవ్ర నష్టం ఎంతో ఉందని అన్నారు. పొగాకు పరిశ్రమల వ్యాపార విధానాలను అడ్డుకోవడం, ముఖ్యంగా యువతను ఈ వ్యసనం బారిన పడకుండా రక్షించడం వల్లనే సాధ్యమని తెలిపారు. పొగాకు వల్ల ఊపిరితిత్తుల క్యాన్సర్, గుండెపోటు, క్షయ, శ్వాసకోశ వ్యాధులు వస్తాయని, నికోటిన్ అనే రసాయనం దీనికి ప్రధాన వ్యసనకారణంగా ఉంటుందన్నారు. పొగాకు కు అలవాటు పడి ప్రపంచవ్యాప్తంగా ఏటా దాదాపు 80 లక్షల మంది ప్రాణాలు కోల్పోతున్నారని, ఇందులో సుమారు 13 లక్షల మంది పరోక్ష ధూమపానం వల్ల చనిపోతున్నారని పేర్కొన్నారు. అక్రమ మానవ రవాణా నివారణకు కఠినమైన చట్టాలు ఉన్నాయని, ఐపీసీ చట్టాలు, కొత్తగా అమల్లోకి వచ్చిన క్రిమినల్ చట్టాల ప్రకారం అక్రమ రవాణాకు పాల్పడే వారికి కఠినమైన జైలు శిక్షలు, జరిమానాలు ఉంటాయన్నారు. రైల్వే స్టేషన్లు, బస్ స్టేషన్లు, విమానాశ్రయాలు, సరిహద్దు ప్రాంతాలలో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయడం ద్వారా మానవ అక్రమ రవాణాను అడ్డుకోవచ్చని తెలిపారు. రెస్క్యూ, పునరావాస చర్యలు, దాడులు నిర్వహించి బాధితులను విడిపించడంతో పాటు బాధితులకు సురక్షితమైన ఆశ్రయ గృహాలు, కౌన్సెలింగ్, వైద్య సహాయం, చట్టపరమైన సాయం అందించడం, బాధితులు సమాజంలో గౌరవంగా బతకడానికి ఉపాధి శిక్షణ, ఆర్థిక సహాయం, విద్యను అందించడం జరుగుతుందన్నారు. మానవ రవాణా జరిగే తీరు, మాయమాటలు, నకిలీ ఉద్యోగాల మోసాలపై ప్రజలకు విస్తృత ప్రచారం కల్పించాలని, పాఠశాల, కళాశాల స్థాయిల్లో విద్యార్థులకు అక్రమ రవాణా గురించిన అవగాహన కల్పించడం జరుగుతుందని, ఏదైనా అనుమానాస్పద చర్యలు లేదా అక్రమ రవాణా గమనించిన వెంటనే సమాచారం అందించడానికి హెల్ప్‌లైన్ నంబర్లను 1091 విస్తృతంగా ఉపయోగించాలని సూచించారు. గ్రామ, పట్టణ స్థాయిల్లో కమ్యూనిటీలను అప్రమత్తం చేయాలని, ఆర్థికంగా బలహీనంగా ఉన్న వర్గాలకు ఉపాధి అవకాశాలు కల్పించడం, మహిళలు, పిల్లలకు విద్య, ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించడం వల్ల వారు అక్రమ రవాణాదారుల వలలో పడకుండా కాపాడవచ్చని సూచించారు. మానవ అక్రమ రవాణాను నివారించడంలో ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, స్థానిక ప్రజల పాత్ర ఎంతో ఉందని, తెలంగాణ ప్రభుత్వం కూడా ఈ నేరాలను అరికట్టేందుకు ప్రత్యేక పాలసీలను, మహిళా భద్రతకు అత్యధిక ప్రాధాన్యతనిచ్చే చర్యలను చేపడుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ భూక్యా రవికుమార్ నాయక్, జనరల్ సెక్రెటరీ షేక్ మొహమ్మద్ ఖాసిం, జాయింట్ సెక్రెటరీ చినుముల నవీన్ కుమార్, ట్రెజరీ సపావట్ బన్సీలాల్, సీనియర్ న్యాయవాది పాలమూరి బాలకృష్ణ, పెద్దూరి నర్సయ్య, సూర్యపాక సత్యనారాయణ, రబ్బాని, కోర్టు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## క్రీడలతో మానసిక ఉల్లాసం



**ఇల్లందు, మే 23, ప్రజాజ్యోతి:** క్రీడలు మానసిక ఉల్లాసం, శారీరక దారుఢ్యానికి ఎంతగానో దోహదపడతాయని మాజీ మున్సిపల్ కౌన్సిలర్ తోట లలితా శారద, మున్నూరు కాపు సంఘ అధ్యక్షుడు పింగళి నరేష్‌లు అన్నారు. ఇల్లందులోని 24 ఏరియాలో గల సింగరేణి రన్స్ అండ్ గోల్డ్ స్టేడియం లో గత నెల రోజులుగా ఫుట్ బాల్ శిక్షణ శిబిరం శనివారం ముగిసింది. మాజీ వార్డు కౌన్సిలర్ లలితా శారద భర్త తోట రమేష్ మెమోరియల్ ఆధ్వర్యంలో సమ్మర్ క్యాంపు ఛాంపియన్స్ 2026 ఫుట్ బాల్ పోటీలు నిర్వహించి గెలుపొందిన క్రీడాకారులకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేసవికాలంలో చిన్నారులకు ఫుట్ బాల్ శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేయడం సంతోషకరమన్నారు. చిన్నారులు చదువుతోపాటు క్రీడల్లో వారి నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని కోరారు. మాదాసు నర్సి, మా దాసు సుమన్, తోట అరుణ్, కీర్తి రవి, రాకేష్, రవిచంద్ర, క్రీడాకారులు పాల్గొన్నారు.

## యువత డ్రగ్స్ కి దూరంగా ఉండాలి

- భద్రాచలం ప్రథమ శ్రేణి న్యాయమూర్తి వి. శివ నాయక్




**భద్రాచలం టౌన్ , మే 23 ప్రజాజ్యోతి** యువత చెడు వ్యాసనాలకు దూరంగా ఉండాలని. డ్రగ్స్ భూతాన్ని తరిమి కొట్టాలని, లక్ష్యం నిర్దేశించుకొని చక్కగా చదువుకొని జీవితంలో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని భద్రాచలం ప్రథమ శ్రేణి న్యాయమూర్తి వి. శివ నాయక్ అన్నారు. శనివారం జాతీయ యూత్ డే సందర్భంగా దక్షిత డీ అడిక్షన్ సెంటర్‌లో మండల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ వారి ఆధ్వర్యంలో న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న శివ నాయక్ మాట్లాడుతూ వివిధ చట్టాల కోసం అవగాహన కల్పిస్తూ, విద్యార్థి దశనుండే చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలని, ప్రతీ ఒక్కరు చట్టాలు తెలుసుకొని భాద్యత కలిగిన పౌరులుగా ఉండాలన్నారు. యువత డ్రగ్స్ విషవలయంలో చిక్కుకొని భవిష్యత్ అంధకారం చేసుకోరాదని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణ కలిగిన జీవితాన్ని కలిగి చదువులో ముందంజ వేయాలని నేటి యువత చేతిలోనే దేశ భవిష్యత్ ఉందని, ఉచిత న్యాయ సహాయం అందించడమే లీగల్ సర్వీసెస్ ముఖ్య ఉద్దేశ్యం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాదులు పేరాల వెంకటేశ్వర్లు, పడిసిరి శ్రీనివాసరావు, పామరాజు తిరుమల రావు, పట్టణ యస్. ఐ. శ్యామ్ ప్రసాద్, దక్షిత డ్రగ్స్ డీ అడిక్షన్ సెంటర్ శ్రీకాంత్, ఓల్డ్ ఏజ్ హోమ్ నిర్వాహకురాలు సరోజినీ పాల్గొన్నారు.

## వైభవంగా కురుమల ఆరాధ్య దైవం బీరప్ప–కామరతి తొలి వార్షికోత్సవ జాతర

- డిల్లెం బల్లెం అంటూ బోనమెత్తిన కురుమలు
- రాజపురంలో మహా అన్నదానం, ప్రత్యేక పూజలు



**అన్నపురెడ్డిపల్లి, మే 23, ప్రజాజ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల రాజపురం గ్రామంలోని కురుమల ఆరాధ్య దైవమైన బీరప్ప–కామరతి దేవాలయంలో తొలి వార్షికోత్సవ జాతరను శనివారం వైభవంగా నిర్వహించారు. గత సంవత్సరం గ్రామ కురుమల ఆధ్వర్యంలో ఎంతో సుందరంగా నిర్మించిన నూతన ఆలయంలో విగ్రహ ప్రతిష్ట నిర్వహించి మహా జాతర జరిపిన నేపథ్యంలో, ఈ ఏడాది తొలి వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.జాతరలో భాగంగా ఉదయం ఆలయాన్ని మామిడి తోరణాలతో అలంకరించారు. అనంతరం అర్చకులు భక్తుల సమక్షంలో హోమం, అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. ప్రతి కురుమ ఇంటి నుంచి ఆడబిడ్డలు సంప్రదాయ బోనాలు ఎత్తుకొని ఆలయానికి చేరుకుని బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. డిల్లెం బల్లెం నినాదాలతో ఆలయ పరిసరాలు మార్మోగగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.అనంతరం మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసి సుమారు 300 మందికి అన్నదానం చేశారు. జాతరకు పరిసర గ్రామాల నుంచి కూడా భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దండి రాము, చింతల కేశవులు, సత్యం, సానిక శ్రీను, శుసి, చక్రధర్, ఎసుబాబు, సుధాకర్, అప్పయ్య, శ్రీను, సులోచన, రజిత, శ్రావణి, వెంకటకుమారి, సీత, నాగమణి, రంజిత, గణేష్, వెంకటనరసమ్మ, వెంకటేశ్వరావు, చెన్న కేశవులు తదితరులు పాల్గొన్నారు.



## రూ.5.54 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం

- సీతంపేట–రాఘవాపురం హై లెవల్ బ్రిడ్జికి శంకుస్థాపన





**సుజాతనగర్, మే 23 ( ప్రజాజ్యోతి )** సీతంపేట–రాఘవాపురం గ్రామాల ప్రజల చిరకాల వాంఛ అయిన హై లెవల్ బ్రిడ్జి నిర్మాణాన్ని త్వరలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు తెలిపారు. సుజాతనగర్ మండలంలో శనివారం రూ.5.54 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రూ.4.75 కోట్ల వ్యయంతో హై లెవల్ బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నామని వెల్లడించారు. ఈ బ్రిడ్జి నిర్మాణంతో గ్రామాల మధ్య రాకపోకలు సులభతరం కావడంతో పాటు వర్షాకాలంలో ఎదురయ్యే ఇబ్బందులు తొలగిపోతాయని పేర్కొన్నారు. పనులను నాణ్యతతో, వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే రెడ్డిపాలెంలో రూ.34 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రజలకు అంకితం చేసినట్లు తెలిపారు. రూ.45 లక్షలతో నిర్మించిన ఎంఆర్సీ భవనం ప్రారంభించడం ఆనందంగా ఉందని దీనివల్ల మండలంలో విద్యా సేవలు మరింత మెరుగుపడతాయని అన్నారు. వేపలగడ్డ స్మశానవాటికలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను దృష్టిలో ఉంచుకుని రెండు బోర్లకు శంకుస్థాపన చేసినట్లు చెప్పారు. నియోజకవర్గ అభివృద్ధే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పల్లెల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని నిధులు మంజూరు చేసి నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, కొత్తగూడెం మేయర్ మూడ్ గణేష్, తహసీల్దార్ వరప్రసాద్, ఎంపీడీవో భారతి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## భద్రాద్రి రామయ్యకు స్వర్ణ తులసార్చన



**భద్రాచలం టౌన్ , మే 23 ప్రజాజ్యోతి** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి శనివారం ఆర్జిత సేవలో భాగంగా స్వర్ణ తులసి అర్చన నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేన అర్చన, పుణ్యాహావచనం, కంకణదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు, వేద ఆశీర్వచనం నిర్వహించారు.

## సరస్వతి అంత్య పుష్కారాలకు వెళ్లే ప్రయాణికులకు భద్రాచలం నుండి బస్సు సౌకర్యం

- **భద్రాచలం డిపో మేనేజర్ జంగయ్య**



**భద్రాచలం టౌన్, మే 23 ప్రజా జ్యోతి** భూపాలపల్లి జిల్లాలో జరిగే సరస్వతి అంత్య పుష్కరాలకు వెళ్లే ప్రయాణికులకు భద్రాచలం డిపో నుండి ప్రత్యేక బస్సు ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ పి జంగయ్య శనివారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ బస్సు (డీలక్స్) ఈనెల 27న అనగా బుధవారం రాత్రి 10 గంటలకు భద్రాచలం బస్టాండు నుంచి బయలు దేరి గురువారం ఉదయం పుష్కర స్నానం అనంతరం బయలుదేరి మధ్యాహ్నం 12 గంటలకు భద్రాచలం చేరుకుంటుందన్నారు. ఈ బస్సు కు టికెట్ ధర పెద్దలకు 1000/– రూపాయలు పిల్లలకు 600/– రూపాయలు ఉంటుందని తెలిపారు. కావున సరస్వతి అంత్య పుష్కరాలకు వెళ్లే ప్రయాణి కులు ఇట్టి సౌకర్యాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఇతర వివరాలకు 9553990399, 9390612253 ఫోన్ నెంబర్లను సంప్రదించాలని ఆయన అన్నారు.

## అదుపుతప్పి చెట్టును ఢీకొన్న ఆటో

- **వైద్య పరీక్షల నిమిత్తం వెళుతుండగా ప్రమాదం...**
- **ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురికి తీవ్రగాయాలు**



**బూర్గంపహాడ్, మే 23 (ప్రజా జ్యోతి):** వైద్యపరీక్షలు చేయించుకునేందుకు వెళుతుండగా ఆటో అదుపుతప్పి చెట్టును ఢీకొనగా ముగ్గురికి తీవ్రగాయాలైన సంఘటన మండల పరిధిలోని కోయగూడెం సమీపంలో శనివారం చోటుచేసుకుంది. దీనికి సంబంధించి స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... కరకగూడెంకు చెందిన అడెపు సతీష్ తన భార్య స్వప్న, కుమారుడు మనోహర్‌తో కలిసి అదే మండలం చిరుమళ్ల గ్రామానికి చెందిన వ్యక్తి ఆటోలో భద్రాచలం ప్రయివేటు ఆసుపత్రిలో వైద్యపరీక్షలు చేయించుకునేందుకు వెళుతున్నారు. ఆటో మండల పరిధిలోని కోయగూడెం సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పడంతో ఆటోను డ్రైవర్ రహదారికి పక్కనే ఉన్న చెట్టుకు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న సతీ ష్, స్వప్న, మనోహర్‌లకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో స్థానికులు హుటాహుటిన వారిని అంబులెన్స్‌లో భద్రాచలం తరలించగా సతీష్, స్వప్నలకు ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స నిర్వహిస్తున్నారు. మనోహర్ పరిస్థితి విషమించడంతో అతన్ని మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించి వైద్యం అందిస్తున్నారు. ఇదిలా ఉండగా సతీష్‌కు గతంలో తలకు స్వల్పచికిత్స చేసి చిప్పను అమర్చారు. తలకు సంబంధించి వైద్యపరీక్షలు చేయించుకునేందుకు వెళుతుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుని మరోసారి తలకు గాయాలయ్యాయి. అంతేకాకుండా తనతో పాటు ఆసుపత్రికి వస్తున్న తన భార్య, కుమారుడికి ఈ ప్రమాదం జరగడం శోచనీయం.

## దుర్గా రమేష్ 14వ వర్ధంతి సభ

- **పార్టీ బలోపేతానికి ఆయన చేసిన కృషి అనిర్వచనీయం: కల్లూరి.వెంకటేశ్వర్లు**

**భద్రాచలం టౌన్, మే 23 ప్రజాజ్యోతి** భద్రాచలం డివిజన్ లో సిపిఐ పార్టీ అభివృద్ధికి, గిరిజన ప్రాంతాల్లో ప్రజా సమస్యల పరిష్కారానికి విశేషకృషి చేసిన మాజీ ఏఐఎస్ ఎఫ్, ఏఐవైఎఫ్, సిపిఐ నాయకులు కీర్తిశేషులు వాతాడి దుర్గా రమేష్ 14వ వర్ధంతి సభ ఘనంగా జరిగింది. స్థానిక సిపిఐ డివిజన్ కార్యాలయంలో ఏఐఎస్ ఎఫ్ మాజీ నాయకుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు రమేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కల్లూరు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. పార్టీ ఎదుగుదలలో దుర్గా రమేష్ పాత్ర అమోఘమని కొనియాడారు. గిరిజన గ్రామాల్లో ప్రజలతో మమేకమై పార్టీ కార్యకర్తల్లో మంచి ముద్ర వేసుకున్నారని, వ్యవసాయ కార్మిక సంఘాల బలోపేతానికి ఆయన నిరంతరం శ్రమించారని గుర్తు చేశారు. దుర్గా రమేష్ లేని లోటు పార్టీకి తీరని నష్టమని పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధన కోసం నేటితరం ఏఐఎస్ ఎఫ్, ఏఐవైఎఫ్ కార్యకర్తలు, కార్మిక సంఘ నాయకులు అంకితభావంతో పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ సీనియర్ నాయకులు వాతారి దుర్గారావు, భాస్కరరావు, మారెడ్డి శివాజీ, నరసింహమూర్తి, బచ్చు శ్రీనివాస్, ఏఐవైఎఫ్ నాయకులు సాధనపల్లి సతీష్, కుక్కిరేణి అశోక్ కుమార్, నారపొంగు యేసు, పసుపులేటి సాయి, కుమారి, మహమ్మద్ వలి, దాసరి శేఖర్, సీతారామరాజు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



# యువత ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలి

- **జిల్లా కలెక్టర్ అంకిత్**





**కొత్తగూడెం కలెక్టరేట్, మే 23, (ప్రజా జ్యోతి)** ప్రజా పాలన– ప్రగతి ప్రణాళిక 99 రోజుల ఆక్షన్ ప్లాన్‌లో భాగంగా జిల్లా యువజన, క్రీడల శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 18 నుండి నేటి వరకు యువజనోత్సవ వారోత్సవాలు ఘనంగా నిర్వహించినట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. శనివారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని వివిధ కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఈనెల 4 న ఖమ్మంలో నిర్వహించిన మెగా జాబ్ మేళాలో ఉద్యోగాలు సాధించిన 105 మంది యువతీ, యువకులకు జిల్లా కలెక్టర్ ప్రొవిజినల్ ఆఫర్ లెటర్లను అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యువత ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని, స్వయం సమృద్ధి సాధించాలని సూచించారు. యువత అభివృద్ధే రాష్ట్ర ప్రగతికి బలమైన పునాది అని అన్నారు. అనంతరం సీఎం కప్ – 2026తో పాటు ఇతర క్రీడా పోటీలలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులకు, సమ్మర్ క్యాంపుల్లో విశేష ప్రతిభ ప్రదర్శించిన యువతకు జిల్లా కలెక్టర్ మెడల్స్ ప్రదానం చేసి అభినందించారు. క్రీడలు యువతలో క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని తెలిపారు. రాష్ట్ర స్థాయిలో జిల్లా యువత ప్రతిభ చాటుకోవడం గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా డిపార్ట్మెంట్ ఆఫ్ టూరిజం రూపొందించిన "తెలంగాణ టూరిజం బ్రాండ్ కిట్ – తెలంగాణ జరూర్ ఆనా"ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలు, చారిత్రక, పర్యాటక విశేషాలను ప్రజలకు మరింత చేరువ చేయడంలో ఈ బ్రాండ్ కిట్ ఉపయోగపడుతుందని తెలిపారు. జిల్లా యువతకు టూరిజం శాఖ అందిస్తున్న "సర్టిఫికేట్ కోర్స్ ఆన్ మ్యూజియాలజీ", "సర్టిఫికేట్ కోర్స్ ఆన్ ఆర్కియాలజీ" కోర్సుల గురించి కలెక్టర్ వివరించారు. టూరిజం రంగంపై ఆసక్తి ఉన్న యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉపాధి అవకాశాలు పొందవచ్చని సూచించారు. కోర్సులకు సంబంధించిన పూర్తి వివరాల కోసం కో–ఆర్డినేటర్ డా. పి. నాగరాజు (డీడీ, మ్యూజియమ్స్) ను ఫోన్ నెంబర్లు 9849905722, 9849905723 ద్వారా లేదా archaeologydht@gmail.com ద్వారా సంప్రదించవచ్చని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన, క్రీడల అధికారి యం. పరంధామ రెడ్డి, జి ఎం డి ఐ సి మధుసూదన్ రెడ్డి, పి ఐ ఓ పృథ్వి, ప్రశాంతి నగర్ సర్పంచ్ లైలా, శ్రీ రామచంద్ర డిగ్రీ కాలేజీ ప్రిన్సిపల్ పద్మ, వైస్ ప్రిన్సిపాల్ వనజ క్రీడ కోచ్ లు: అబ్దుల్ నబి, కాసి హుస్సేన్, నాగేశ్వర్ రావు, లగడపాటి రమేష్, వై.వి శ్రీనివాస్, డానియల్ రాంబాబు, నవీన్, గిరి ప్రసాద్, నాగేంద్ర, జగన్నాథ్, పాపరాజు, శ్రీనివాస్, నాగ శివాజీ, మల్లికార్జున్, ప్రమీల, రవి కిరణ్, అఖిల్, కార్యాలయ సిబ్బంది తిరుమలరావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

## 6వ రోజుకు చేరిన వీవోఏల రిలేదీక్షలు



**బూర్గంపహాడ్, మే 23 (ప్రజా జ్యోతి):** జిల్లాలో వీవోఏల పరిస్థితి దయనీయంగా మారిందని... జీతం జానెడు... పని భారం బారెడు అన్న చందంగా తమ బతుకులు ఉన్నాయంటూ వీవోఏలు తెలంగాణ ఐకేపీ వీవోఏల జాయింట్ యాక్షన్ కమిటీ(జేఏసీ) సెర్ప్ ఆధ్వర్యంలో బూర్గంపహాడ్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట చేపట్టిన రిలేదీక్షలు శనివారం 6వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా వీవోఏలు మాట్లాడుతూ ఎండను సైతం లెక్కచేయకుండా రిలేదీక్షలు చేస్తున్నా తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలేదని వాపోయారు. వీవోఏలకు రూ.26వేల గౌరవవేతనం, పీఆర్ సీ అమలుచేయాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని, ప్రమాదబీమా రూ.20లక్షలు చెల్లించాలని, ఆరోగ్యబీమా రూ.10లక్షలు కల్పించాలని, అర్హులైన వీవోఏలను సీసీలుగా పదోన్నతి కల్పించాలని, గుర్తింపుకార్డులు, ట్యాబ్ లతో పాటు నెట్ సౌకర్యం కల్పించాలని, జీవో 58ని సవరించాలని తదితర డిమాండ్లను పరిష్కరించి వీవోఏలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వీవోఏల మండల అధ్యక్షురాలు నిర్మల, కోశాధికారి సావిత్రి, పద్మ, శ్రీలక్ష్మి, సుబ్బమ్మ, రాంచందర్ లతో పాటు మండలంలోని వీవోఏలు పాల్గొన్నారు.

## గిరిజన ప్రాంతాల అభివృద్ధికి భారీ అడుగులు

- **రవాణా, వైద్య సౌకర్యాల మెరుగుదలకు హై లెవల్ బ్రిడ్జిలు , పిహెచ్సి ప్రారంభం**
- **నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యమని ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు వెల్లడి**



**చుంచుపల్లి ప్రజాజ్యోతి** గిరిజన ప్రాంతాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన రవాణా మరియు వైద్య సౌకర్యాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అన్నారు. శనివారం నియోజకవర్గ పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఆయన శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. చిట్టిరామవరం–చుంచుపల్లి రహదారిపై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి, అలాగే కొత్తగూడెం బైపాస్ రోడ్డు నుంచి పెనుబల్లి (గరిమెళ్లపాడు) ప్రధాన రహదారిపై మరో హై లెవల్ బ్రిడ్జికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అదేవిధంగా పెనుబల్లిలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పిహెచ్సి) భవనాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మౌలిక వసతుల కల్పనతో గ్రామాల రూపురేఖలు మార్చడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. బ్రిడ్జిల నిర్మాణంతో దశాబ్దాలుగా కొనసాగుతున్న రవాణా సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. గ్రామీణ ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందుబాటులో ఉండేలా ఆధునిక పిహెచ్సిని ఏర్పాటు చేశామని చెప్పారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించేందుకు మరిన్ని నిధులు తీసుకువస్తామని, ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు.

# 5 కేజీల ఐఈడీ నిర్వీర్యం





**చర్ల , మే 23(ప్రజా జ్యోతి ):** ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడ జిల్లాలో భద్రతా దళాలు అప్రమత్తంగా వ్యవహరించి భారీ ప్రమాదాన్ని తప్పించాయి. శనివారం బర్సూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హిద్పాల్ గ్రామ అటవీ ప్రాంతంలో నక్సలైట్లు దాచిపెట్టిన 5 కేజీల ప్రెషర్ కుక్కర్ ఐఈడీని గుర్తించి సురక్షితంగా నిర్వీర్యం చేశారు.పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు, హిద్పాల్ గ్రామ పరిసర కొండలు, దట్టమైన అటవీ ప్రాంతాలు , సున్నిత ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టేందుకు 195వ బెటాలియన్ సీఆర్పీఎఫ్ యంగ్ ప్లాటూన్ పార్టీతో పాటు బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్ బృందాన్ని రంగంలోకి దించారు. ఈ ఆపరేషన్‌ను సెకండ్ కమాండ్ ఆఫీసర్ విక్రాంత్ వర్మ మార్గదర్శకత్వంలో, అసిస్టెంట్ కమాండెంట్ సంజీవ్ కుమార్ యాదవ్ నేతృత్వంలో జిల్లా పోలీసులతో కలిసి ఉదయం 5 గంటలకు ప్రారంభించారు.గాలింపు చర్యల్లో భాగంగా ఉదయం 8:20 గంటల సమయంలో హిద్పాల్ గ్రామ అటవీ ప్రాంతంలో భద్రతా సిబ్బందికి అనుమానాస్పద వస్తువు కనిపించింది. వెంటనే అప్రమత్తమైన సిబ్బంది భద్రతా ప్రమాణాలను పాటిస్తూ ఆ ప్రాంతాన్ని తమ ఆధీనంలోకి తీసుకుని బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్‌ను సంఘటన స్థలానికి పిలిపించారు.బీడీఎస్ బృందం పరిశీలించగా, అది సుమారు 5 కిలోగ్రాముల బరువున్న ప్రెషర్ కుక్కర్ ఐఈడీగా తేలింది. భద్రతా దళాలకు నష్టం కలిగించడం, ప్రజల్లో భయాందోళనలు సృష్టించడం లక్ష్యంగా నక్సలైట్లు ఈ పేలుడు పదార్థాన్ని అటవీ ప్రాంతంలో అమర్చినట్లు అధికారులు తెలిపారు.అనంతరం సాంకేతిక పద్ధతులను ఉపయోగించి బాంబ్ డిస్పోజల్ స్క్వాడ్ ఆ ఐఈడీని అక్కడికక్కడే సురక్షితంగా నిర్వీర్యం చేసి ధ్వంసం చేసింది. భద్రతా దళాల అప్రమత్తత, వేగవంతమైన చర్యలతో భారీ ప్రాణనష్టం తప్పినట్లు అధికారులు పేర్కొన్నారు.ఆపరేషన్ అనంతరం పరిసర ప్రాంతాల్లో అదనపు గాలింపు చర్యలు కూడా చేపట్టారు. ఉదయం 10:55 గంటలకు ఆపరేషన్ విజయవంతంగా ముగియగా, అధికారులు సైనికులు సురక్షితంగా తమ బేస్ క్యాంపులకు చేరుకున్నారు.దంతేవాడ జిల్లా పోలీసులు భద్రతా దళాలు ఈ ప్రాంతంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం నిరంతరం ఆపరేషన్లు కొనసాగిస్తున్నాయి అని ఏవైనా అనుమానాస్పద కార్యకలాపాలు, పేలుడు పదార్థాలు లేదా నక్సలైట్ కదలికలు గమనించిన వెంటనే సమీప పోలీస్ స్టేషన్ లేదా భద్రతా దళాలకు సమాచారం అందించాలని ప్రజలను అధికారులు కోరారు.

## విద్యుత్ సరఫరాపై నిరంతర పర్యవేక్షణ



**బూర్గంపహాడ్, మే 23 (ప్రజా జ్యోతి ):** బూర్గంపహాడ్ మండలంలో విద్యుత్ సరఫరా విషయంలో ట్రాన్స్ కో అధికారులు నిరంతర పర్యవేక్షణ చేస్తున్నారు. పారిశ్రామిక వాడ సారపాకలో ఇప్పటికే 20 ట్రాన్స్ ఫార్మర్లను ఏర్పాటు చేసి ఈ ప్రాంత వినియోగదారులకు కరెంటు సరఫరాలో కోతలు లేకుండా ఎప్పటికప్పుడు లోవోల్టేజీ, హైవోల్టేజీ సమస్యపై విద్యుత్ సిబ్బందిపై ఆరాతీస్తూ ట్రాన్స్ కో డీఈ జీవన్ కుమార్ ఏడీఈ నర్సింహారావు, ఏఈ ఉపేందర్ లతో కలిసి రాత్రి సమయాల్లో పర్యవేక్షణ చేస్తున్నారు. సారపాకలో ట్రాన్స్ ఫార్మర్లలోడు ఎక్కువగా ఉండటంతో పాటు ట్రిప్ అవుతుండటంతో విద్యుత్ సిబ్బందిచే మరమ్మతులు చేపడుతూ, ఫీజులు పోయిన చోట వాటిని వేయిస్తూ వినియోగదారులకు కరెంటు సరఫరాలో ఇబ్బంది లేకుండా చర్యలు చేపడుతున్నారు. శుక్రవారం రాత్రి ట్రాన్స్ కో సిబ్బంది ట్రాన్స్ ఫార్మర్ల వేడి ని తగ్గించేందుకు నీటితో తడిపే చర్యలు చేపట్టారు. విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనుల పరిశీలన



**చర్ల, మే 23: (ప్రజా జ్యోతి ):** చర్ల మండలంలోని లక్ష్మీ కాలనీ గ్రామపంచాయతీలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కొనసాగుతున్న పనులను ఎంపీడీవో ఈదయ్య శనివారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. పని ప్రదేశాన్ని సందర్శించిన ఆయన అక్కడ జరుగుతున్న పనుల పురోగతి, కూలీల హాజరు నమోదు విధానం, పనుల నాణ్యత తదితర అంశాలను పరిశీలించారు.ఈ సందర్భంగా ఉపాధి హామీ కూలీలను ఉద్దేశించి ఎంపీడీవో మాట్లాడుతూ ఎండ తీవ్రత దృష్ట్యా పనులు నిర్వహించే సమయంలో తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. తాగునీరు, విశ్రాంతి వంటి సౌకర్యాలను వినియోగించుకోవాలని ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కూలీలకు అవగాహన కల్పించారు. అలాగే ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.అదేవిధంగా పని ప్రదేశంలో మొబైల్ ద్వారా హాజరు నమోదు చేసే విధానాన్ని పరిశీలించిన ఎంపీడీవో అటెండెన్స్ నమోదు పారదర్శకంగా సక్రమంగా జరగాలని అధికారులకు ఆదేశించారు. కూలీల వివరాలు ఖచ్చితంగా నమోదు చేయాలని సూచించారు. పనులు నాణ్యతతో పూర్తి చేయడంతో పాటు ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పేర్కొన్నారు.గ్రామ సర్పంచ్ పూనం జోగ మహాలక్ష్మి , ఈజీఎస్ ఈసి / ఏపీఓ సాంబశివరావు, పంచాయతీ కార్యదర్శి రవి, ఫీల్డ్ అసిస్టెంట్ కారం శ్రీనివాస్ రావు, ఉపాధి హామీ కూలీలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## రాష్ట్ర ఎస్సీ విభాగ ఉపాధ్యక్షుడిగా గడ్డం రాజశేఖర్

- కాంగ్రెస్ పార్టీకి అంకితభావంతో సేవలందించిన నాయకుడికి రాష్ట్ర స్థాయి బాధ్యతలు





**కొత్తగూడెం, మే 23 ( ప్రజా జ్యోతి )** కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి విద్యార్థి దశ నుంచే ప్రజా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొంటూ వస్తున్న భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు చెందిన గడ్డం రాజశేఖర్‌కు రాష్ట్ర స్థాయి పదవి దక్కింది. తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ విభాగ ఉపాధ్యక్షుడిగా ఆయనను నియమిస్తూ ఎస్సీ విభాగ రాష్ట్ర అధ్యక్షుడు కావాంపల్లి సత్యనారాయణ హైదరాబాద్ గాంధీభవన్‌లో అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఈ నియామకంతో జిల్లా కాంగ్రెస్ శ్రేణుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. కొత్తగూడెం నియోజకవర్గంలోని రామవరం ప్రాంతానికి చెందిన గడ్డం రాజశేఖర్ విద్యార్థి దశ నుంచే కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాల్లో చురుకైన పాత్ర పోషించారు. యువత సమస్యలు, సామాజిక అంశాలపై నిరంతరం స్పందిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేశారు. 2018లో ఎన్ఎస్‌యూఐ కొత్తగూడెం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శిగా సేవలందించిన ఆయన, అనంతరం యువజన కాంగ్రెస్ ఎన్నికల్లో పోటీ చేసి విశేష మెజారిటీతో గెలుపొందారు. ప్రస్తుతం జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా కొనసాగుతూ పార్టీ కార్యక్రమాలను గ్రామ స్థాయికి తీసుకెళ్తున్నారు. పార్టీ ప్రతిపక్షంలో ఉన్న సమయంలోనూ నిరంతరం ప్రజల సమస్యలపై పోరాడుతూ కాంగ్రెస్ పిలుపునిచ్చిన ప్రతి కార్యక్రమంలో ముందుండి పనిచేసిన ఆయన సేవలను గుర్తించి రాష్ట్ర స్థాయి బాధ్యతలు అప్పగించినట్లు పార్టీ నాయకులు పేర్కొన్నారు. సామాజిక న్యాయం, ఎస్సీల హక్కుల పరిరక్షణ, యువత సాధికారత కోసం రాజశేఖర్ మరింత సమర్థంగా పనిచేస్తారనే నమ్మకం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గడ్డం రాజశేఖర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ తనకు ఇచ్చిన బాధ్యతను అత్యంత బాధ్యతాయుతంగా నిర్వర్తిస్తానన్నారు. పార్టీ బలోపేతంతో పాటు ఎస్సీల హక్కుల సాధన కోసం క్షేత్రస్థాయిలో మరింతగా పనిచేస్తానని తెలిపారు. తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర స్థాయి పదవి కల్పించిన ఎస్సీ విభాగ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క , రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి , వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు , జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోటా దేవి ప్రసన్న, తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పోదెం వీరయ్యలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

## బిఆర్ఎస్ సభ్యత్వ నమోదు సమావేశం



**చర్ల, మే 23: (ప్రజా జ్యోతి ):** బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వ నమోదు డిజిటల్ ప్రక్రియలో భాగంగా భద్రాచలం నియోజకవర్గ ఇన్చార్జిగా నియమితులైన రావులపల్లి రాంప్రసాద్ శనివారం తొలిసారిగా చర్ల మండల పర్యటనకు విచ్చేశారు. ఆయనతో పాటు మానే రామకృష్ణ , వాసు రాజు కూడా పాల్గొన్నారు.ఈ సందర్భంగా చర్లలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో రావులపల్లి రాంప్రసాద్ పాల్గొని పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమంపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. చర్ల మండలంలోని 36 బూత్‌లకు గాను 72 మంది ఏజెంట్లను ప్రకటించారు. సభ్యత్వ నమోదు ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని కార్యకర్తలకు సూచించారు.అనంతరం భద్రాచలం నియోజకవర్గ ఇన్చార్జిగా నియమితులైన రావులపల్లి రాంప్రసాద్ ని పార్టీ నాయకులు శాలువాతో ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో చర్ల మండల కన్వీనర్ దొడ్డి తాతారావు , కో–కన్వీనర్ అయినవోలు పవన్ కుమార్, పార్టీ సీనియర్ నాయకులు సయ్యద్ అజీజ్, మాత రాము, పంజా రాజు, కాకి అనిల్, గోరంట్ల వెంకటేశ్వరరావు, అంబోజి సతీష్, కుప్పాల సౌజన్య, కారం కన్నారావు, సాదిక్, తెల్లం లక్ష్మీనారాయణ, సృజన్, కుక్క దప్పు సాయి, గాథంశెట్టి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## పని అంతా వీఓఏలతోనే.. గుర్తింపు మాత్రం శూన్యం

- పాల్వంచలో వీఓఏల నిరవధిక సమ్మె





**పాల్వంచ, మే 23, ప్రజాజ్యోతి:** తమ న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ఐకేపీ వీఓఏల జేఏసీ ఆధ్వర్యంలో పాల్వంచ పట్టణంలో వీఓఏలు నిరవధిక సమ్మెకు దిగారు. శుక్రవారం నిర్వహించిన నిరసన కార్యక్రమంలో వీఓఏలు పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. “గ్రామాల్లో పని మాత్రం మాతో చేయించుకుంటారు.. కానీ మా బతుకుల గురించి మాత్రం ప్రభుత్వం పట్టించుకోవడం లేదు” అంటూ వీఓఏలు ఆవేదన వ్యక్తం చేశారు. మహిళా సంఘాల బలోపేతం నుంచి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు వరకు ప్రతి కార్యక్రమంలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ తమకు కనీస గుర్తింపు కూడా దక్కడం లేదని మండిపడ్డారు.సంవత్సరాలుగా సేవలు అందిస్తున్నప్పటికీ తగిన వేతనాలు లేక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ప్రస్తుతం అందుతున్న అల్ప వేతనాలతో కుటుంబాలను పోషించడం కష్టసాధ్యంగా మారిందని వాపోయారు. వెంటనే వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని, పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం పదేపదే హామీలు ఇచ్చి అమలు చేయకుండా మోసం చేస్తోందని ఆరోపించిన వీఓఏలు, సమస్యలు వెంటనే పరిష్కరించకపోతే తమ ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జేఏసీ అధ్యక్షురాలు అనురాధ, కార్యదర్శి రమేష్ తో పాటు జ్యోతి, సుమలత, సుజాత, మీనా, కల్పన, మౌనిక కుమారి, తార, అనూష, శైలజ, రమణ, కృష్ణవేణి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## తప్పుడు ఎస్సీ సర్టిఫికెట్లపై విచారణ జరపాలి

- పాల్వంచలో జాయింట్ కలెక్టర్‌కు విశ్వహిందూ పరిషత్ వినతి




**పాల్వంచ, మే 23, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండల పరిధిలో క్రైస్తవ మతంలోకి మారిన కొందరు వ్యక్తులు తాము హిందువులమని తప్పుడు వివరాలు ఇచ్చి ఎస్సీ కుల ధ్రువీకరణ పత్రాలు పొందుతున్నారని ఆరోపిస్తూ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం పాల్వంచలోని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాయింట్ కలెక్టర్‌కు విహెచ్‌పీ నాయకులు మెమోరాండం సమర్పించారు.రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 మరియు రాష్ట్రపతి ఉత్తర్వులు–1950 ప్రకారం షెడ్యూల్డ్ కులాలకు చెందిన వ్యక్తులు క్రైస్తవ మతాన్ని స్వీకరిస్తే వారు బీసీ–సీ కేటగిరీకి చెందుతారని, అయితే పాల్వంచ మండలంలో కొందరు క్రైస్తవ మతంలోకి మారినప్పటికీ తాసిల్దార్ కార్యాలయంలో తాము హిందువులమని పేర్కొని తప్పుడు ఎస్సీ ధ్రువీకరణ పత్రాలు పొందుతున్నారని ఆరోపించారు. దీంతో నిజమైన ఎస్సీ వర్గాలకు దక్కాల్సిన రాజ్యాంగ పరిరక్షణలు, సంక్షేమ ఫలాలు దూరమవుతున్నాయని పేర్కొన్నారు. ఇటువంటి కేసులపై సమగ్ర విచారణ జరిపి తప్పుడు ఎస్సీ ధ్రువీకరణ పత్రాలను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ఖమ్మం విభాగ్ సంఘటన కార్యదర్శి గడిదేసి వెంకటేశ్వర్లు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సంఘటన కార్యదర్శి గంగాధరి సీత, పాల్వంచ ప్రఖండ అధ్యక్షుడు గుగులోతు లింక్ నాయక్, ఉపాధ్యక్షుడు చల్లా లింగన్న, కార్యదర్శి దాసరి మాధవరావు, సహ కార్యదర్శి వేములపల్లి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## గోవుల అక్రమ రవాణాపై కఠిన చర్యలు తీసుకోవాలి

- పాల్వంచ డీఎస్పీ, సీఐ, ఎస్ఐలకు విహెచ్‌పీ వినతి.





**పాల్వంచ, మే 23, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో గోవుల అక్రమ రవాణా, అక్రమ వధ యథేచ్ఛగా కొనసాగుతున్నాయని ఆరోపిస్తూ వాటిపై కఠిన చర్యలు తీసుకోవాలని విశ్వహిందూ పరిషత్ (విహెచ్‌పీ) డిమాండ్ చేసింది. ఈ మేరకు పాల్వంచ డీఎస్పీ, సీఐ, పట్టణ ఎస్ఐలకు విహెచ్‌పీ నాయకులు వినతిపత్రాలు సమర్పించారు.దేశంలో గోవధ నిషేధ చట్టాలు అమల్లో ఉన్నప్పటికీ వాటిని సమర్థవంతంగా అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని విహెచ్‌పీ నాయకులు ఆరోపించారు. 1977లో అమల్లోకి వచ్చిన "ప్రొహిబిషన్ ఆఫ్ కౌ స్లాటర్ అండ్ ఆనిమల్ ప్రిజర్వేషన్ యాక్ట్"తో పాటు రాజ్యాంగంలోని ఆర్టికల్ 48 కూడా గోరక్షణకు సంబంధించినదేనని పేర్కొన్నారు.అయితే భద్రాద్రి జిల్లాలో గోసంతతి అక్రమ రవాణా కొనసాగుతూనే ఉందని, ముఖ్యంగా బక్రీద్ సందర్భంగా అక్రమ గోవధలు పెరిగే అవకాశాలు ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. హిందువులు పవిత్రంగా భావించే గోసంతతిని రక్షించేలా చట్టాలను కఠినంగా అమలు చేయాలని, అక్రమంగా నిర్వహిస్తున్న కబేళాలను మూసివేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ ఖమ్మం విభాగ్ సంఘటన కార్యదర్శి గడిదేశి వెంకటేశ్వర్లు, జిల్లా సంఘటన కార్యదర్శి గంగాధరి సీత, పాల్వంచ ప్రఖండ అధ్యక్షుడు గుగులోత్ లింబా నాయక్, కార్యదర్శి దాసరి మాధవరావు, ఉపాధ్యక్షుడు చల్లా లింగన్న, సహ కార్యదర్శి వేములపల్లి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# ఐక్య పోరాటాలతోనే కార్మిక హక్కుల సాధన

- కూనంనేని సమక్షంలో ఏఐటీయూసీ, సీపీఐలో చేరిన 90 మంది కార్మికులు.



**పాల్వంచ, మే 23, ప్రజాజ్యోతి:** కార్మిక హక్కుల సాధన ఐక్య పోరాటాలతోనే సాధ్యమవుతుందని, శ్రమ దోపిడీకి వ్యతిరేకంగా కార్మికులంతా ఎర్ర జెండా నీడలోకి రావాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు పిలుపునిచ్చారు.కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పాల్వంచ మున్సిపల్ శాఖ వివిధ విభాగాల్లో పని చేస్తున్న 90 మంది కార్మికులు శనివారం కూనంనేని సమక్షంలో ఏఐటీయూసీ, సీపీఐ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి ఎర్ర కండువాలు కప్పి పార్టీలోకి, యూనియన్‌లోకి సాదరంగా ఆహ్వానించారు.అనంతరం జరిగిన సభలో కూనంనేని మాట్లాడుతూ దేశంలో, రాష్ట్రంలో కార్మికులు, ఉద్యోగులు అనుభవిస్తున్న ప్రతి హక్కు ఏఐటీయూసీ పోరాట ఫలితమేనన్నారు. పనిభద్రత, కనీస వేతనాలు, చట్టబద్ధ సౌకర్యాల అమలు పాలకులు, యాజమాన్యాల బాధ్యత అని పేర్కొన్నారు. అయితే ప్రస్తుతం పాలకులు ఈ బాధ్యతలను విస్మరించి కార్మిక హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు.కార్మిక వర్గం ఎన్నో పోరాటాలు, త్యాగాలతో సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు కోడులుగా విభజించి కార్మిక సంక్షేమాన్ని యాజమాన్యాలకు తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఆదాని, అంబానీ వంటి పెట్టుబడిదారులకు అనుకూలంగా వ్యవహరిస్తోందని విమర్శించారు.కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని, కార్మిక వర్గం హక్కుల కోసం ఏఐటీయూసీ ఎల్లప్పుడూ ముందుంటుందని తెలిపారు. కార్మిక వర్గం ఐక్యంగా తిరగబడితే పాలకులు తల వంచక తప్పదన్నారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు వీసంశెట్టి పూర్ణచంద్రరావు, ఉప్పుశెట్టి రాహుల్, కార్పొరేటర్లు వీసంశెట్టి విశ్వేశ్వరరావు, గుర్రం వెంకటేశ్వర్లు, నామ కీర్తి, గొర్లె అన్నపూర్ణతో పాటు సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు పాల్గొన్నారు.సీపీఐ పార్టీలో ఏలూరు రామారావు, ఏలూరు విజయ లక్ష్మి, దొనకొండ రామకృష్ణ చేరగా, ఏఐటీయూసీలో నాగేశ్వరావు, రవి, సురేందర్, లక్ష్మయ్య, రాయప్ప, అశోక్, రమేష్, వెంకటేష్, ప్రవీణ్, రాంబాబు, సరోజ, విజయ, లాలీ, రమణ తదితరులతో పాటు గిగ్ వర్కర్లు కూడా చేరారు.

## వైభవంగా బాలాజీ కళ్యాణం

- అన్నపురెడ్డిపల్లిలో భక్తిశ్రద్ధలతో శ్రీ వెంకటేశ్వర స్వామి వారి కల్యాణ మహోత్సవం
- ప్రసాద వితరణ, అన్నప్రసాదంతో భక్తుల సందడి





**అన్నపురెడ్డిపల్లి, మే 23, ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలో గల శ్రీ బాలాజీ వెంకటేశ్వర స్వామివారి దేవస్థానంలో శనివారం స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయ మేనేజర్ పి.వి. రమణ ఆదేశానుసారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో భాగంగా ఆలయాన్ని మామిడి తోరణాలు, పుష్పాలతో ప్రత్యేకంగా అలంకరించారు. వేద మంత్రోచ్చారణల మధ్య అర్చకులు స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళ వాయిద్యాలు, గోవింద నామస్మరణలతో ఆలయ పరిసరాలు భక్తిమయ వాతావరణంతో మార్మోగాయి.స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ప్రసాద వితరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి ఆశీస్సులు పొందారు. అలాగే మల్లెల నరసింహస్వామి,కుమారి దంపతుల ఆధ్వర్యంలో అన్నప్రసాద కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. భక్తులకు ప్రేమతో అన్నప్రసాదం వడ్డించగా, కార్యక్రమంలో పాల్గొన్న వారు నిర్వాహకులను అభినందించారు."జై బాలాజీ" నినాదాలతో దేవస్థానం మార్మోగగా, గ్రామ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## సొంతింటి కల నెరవేర్చేందుకు
## ప్రభుత్వం కృషి చేస్తోంది

- పేదల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- ఇందిరమ్మ ఇళ్లు గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయం



**మణుగూరు, మే 23 (ప్రజాజ్యోతి):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద ప్రజలకు శాశ్వత గృహ సౌకర్యం కల్పించడం, సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తుండడం ఆనందంగా ఉందని పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం మండల పరిధిలోని బెస్తగూడెంలో పిట్ట ముతమ్మ లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు పాల్గొని కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా నూతన గృహాన్ని పరిశీలించి లబ్ధిదారులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తోందని, అర్హులైన ప్రతీ కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా సొంతింటి కలను నెరవేర్చేందుకు కృషి చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రంలో అభివృద్ధి మరియు సంక్షేమ కార్యక్రమాలు సమర్థవంతంగా కొనసాగుతున్నాయని తెలిపారు. పేద ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచే దిశగా ప్రభుత్వం చేపడుతున్న ప్రతి సంక్షేమ పథకాన్ని అర్హులందరికీ అందించేందుకు తాను నిరంతరం కృషి చేస్తున్నానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు మున్సిపల్ డీఈ శ్రీనివాస్, హౌసింగ్ ఏఈ పావని, వర్క్ ఇన్స్పెక్టర్ అనిల్, మండల అధ్యక్షులు పీరినాకి నవీన్, భద్రాద్రి జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ శివ సైదులు, బానోత్ లక్ష్మణ్, 14 టైర్ అధ్యక్షులు దుగ్గంపూడి ఈశ్వర్ రెడ్డి, శివాలయం చైర్మన్ కూచిపూడి బాబు, పాతూరు వెంకన్న, బొగ్గు ముఠా అధ్యక్షులు నీరుడు రాంబాబు, కురం రవి, తుపూడి శ్రీను, జర్పుల జగన్, దొడ్డపునేని మధు, తాత ప్రసాద్, తమ్మిశెట్టి సాంబ, ఆముదాల శ్యామల, వేముల స్వరూప, బత్తుల శ్రీను, పల్లెం నగేష్, మోడం ముత్యాలరావు, కట్ట నరసింహ, దేగల కృష్ణారావు, గుమస్తాల సంఘం నాయకులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి నిరంతర ప్రక్రియ









- **పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే**

**టేకులపల్లి,మే23,ప్రజాజ్యోతి:** అభివృద్ధి అనేది నిరంతర ప్రక్రియ అని టేకులపల్లి మండలంలోని గ్రామాలు అభివృద్ధి పరచాలన్నదే తన సంకల్పమని ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు.శనివారం టేకులపల్లి మండలం తడికలపూడి గ్రామ పంచాయతిలో 1కోటి 33 లక్షల రూపాయలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం కిష్టారం గ్రామాలలో ప్రజా ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్మించిన ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల గృహప్రవేశంలో ఎమ్మెల్యే కోరం కనకయ్య పాల్గొన్నారు. లచ్చగూడెం గ్రామంలో గ్రామపంచాయతీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించారు. బొమ్మన పల్లి గ్రామంలో ప్రజల సౌకర్యార్థం, స్వచ్ఛమైన తాగునీటి కోసం గ్రామపంచాయతీ ఏర్పాటుచేసిన మినరల్ వాటర్ ప్లాంట్ ను ఎమ్మెల్యే పురం కనకయ్య ప్రారంభిం చారు. ఎమ్మెల్యే మాట్లాడుతు పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎక్కడికక్కడ అభివృద్ధి పనులు నిలిచిపోయాయని అన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే విద్య,వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు గుర్తుచేశారు. రోడ్లు,డ్రైనేజీలు,హై లెవెల్ బ్రిడ్జి లను నిర్మించి ప్రజలకు ప్రయాణం సులభం చేసిన ప్రభుత్వం ప్రజా ప్రభుత్వం అని అన్నారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ అనేకమైన ప్రజలకు ఉపయోగపడే అభివృద్ధి పనులను నేరుగా నా ద్వారా ప్రజలకు అందించడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు కోరం సురేందర్, ఇల్లందు మార్కెట్ కమిటి చైర్మెన్ బానోత్ రాంబాబు, టేకులపల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లక్కినేని శ్యామ్ మోహన్, జిల్లా కమిటి సభ్యులు కాలే ప్రసాద్,పలు గ్రామాల ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గోన్నారు.

# ఆయిల్ ఫేడ్ అమ్మ లాంటిది

- **రైతుల పేరుతో అసత్యప్రచారాలు మానుకోవాలి**
- **దళారుల ప్రయోజనాల కోసం రైతులకు తప్పుడు సమాచారాన్ని అందిస్తున్నారు**
- **ఆయిల్ ఫేడ్ ను కాపాడుకోవాల్సిన బాధ్యత రైతులందరిపై ఉంది.... మద్దినేని వెంకట్.... ఆయిల్ ఫామ్ రైతు**



**అశ్వారావుపేట, మే 23, ప్రజాజ్యోతి :** దళారుల ప్రయోజనాల కోసం రైతులకు తప్పుడు సమాచారాన్ని అందిస్తూ ఆయిల్ ఫెడ్ సంస్థను తెలంగాణ రాష్ట్రంలో నిర్వీర్యం చేసేందుకు రైతుల పేరుతో కొందరు సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు చేస్తున్నారని ఆయిల్ ఫామ్ రైతు మద్దినేని వెంకట్ మండిపడ్డారు. శనివారం పత్రికలకు విడుదల చేసిన ఓ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ నర్మెట్ట ఫ్యాక్టరీ పనితీరుపై సోషల్ మీడియాలో జరుగుతున్న విమర్శలు, ఆరోపణలు,ఆయిల్ ఫెడ్‌ను లక్ష్యంగా చేసుకుని జరుగుతున్న ప్రచారం వెనుక ప్రైవేట్ కంపెనీల ప్రయోజనాలు ఉన్నాయన్నారు. ఆయిల్ ఫెడ్ రైతులకు రాష్ట్రంలోనే అత్యధిక ధరలు, మెరుగైన రికవరీ అందిస్తోందని, రైతుల ప్రయోజనాల కోసం పనిచేస్తున్న ప్రభుత్వ సంస్థను బలహీనపర్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. కొందరు వ్యక్తులు సోషల్ మీడియా వేదికగా తప్పుడు ప్రచారం చేస్తూ రైతుల్లో అపోహలు సృష్టిస్తున్నారని రైతులందరూ గమనించాలన్నారు. ఆయిల్ ఫెడ్ ఉద్యోగులు, అధికారులను లక్ష్యంగా చేసుకుని వారి మనోధైర్యాన్ని దెబ్బతీయాలని చూస్తున్నారని, రైతులకు సేవలందిస్తున్న సిబ్బందిపై అసత్య ప్రచారం చేయడం సరికాదని అభిప్రాయపడ్డారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం వంటి జిల్లాల్లో కొత్తగా సాగులోకి వచ్చిన ఆయిల్ పామ్ తోటల రైతులకు మార్కెట్ కల్పించాల్సిన బాధ్యత ఆయిల్ ఫెడ్‌పై ఉందని తెలిపారు. అలాంటి గెలలను కొనుగోలు చేయకపోతే కొత్త రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి వస్తుందని పేర్కొన్నారు. ఇక రాష్ట్రంలో ఆయిల్ పామ్ రైతులకు అత్యధిక రేటు, రికవరీ అందిస్తున్న సంస్థ ఆయిల్ ఫెడ్ మాత్రమేనని, లాభాపేక్ష కంటే రైతు సంక్షేమానికే ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రైవేట్ కంపెనీలు, దళారుల ప్రయోజనాల కోసం జరుగుతున్న అసత్య ప్రచారాన్ని రైతులు నమ్మవద్దని, తెలంగాణ ఆయిల్ ఫెడ్ అమ్మలాంటిదని, కాపాడుకోవాల్సిన బాధ్యత రైతులందరిపై ఉందని విజ్ఞప్తి చేశారు.

**››› రోజుకు 18 గంటలు రైతు సంక్షేమం ధ్యేయంగా తుమ్మల పని చేస్తున్నారు**

నిరంతరం ఆయిల్ ఫామ్ రైతుకు అండగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రతినిధిగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉన్నారని, రైతులు ఆర్థిక అభివృద్ధి సాధించడమే ధ్యేయంగా రోజుకు 18 గంటలు పనిచేసే రైతు నాయకుడు తుమ్మలని ఆయన ఆధ్వర్యంలో ఆయిల్ ఫామ్ రైతులు మరింత అభివృద్ధి సాధిస్తారన్న నమ్మకంతో ఉన్నామన్నారు. రైతుల ముసుగులో ఆయిల్ ఫేడ్ సంస్థపై అసత్య ప్రచారాలు చేసే వ్యక్తులను రైతు సోదరులు కూడా గమనిస్తున్నారని అందుకే వారి ప్రచారాలపై స్పందించడం లేదన్నారు. పామాయిల్ రైతుల అభివృద్ధికి సంక్షేమానికి కృషి చేస్తున్న తుమ్మలకు ప్రతి రైతు తరుపున కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు.

## సర్ ప్రక్రియకు ప్రజలు సహకరించాలి

- **భద్రాచలం తహసీల్దారు దనియాల వెంకటేశ్వర్లు**





**భద్రాచలం టౌన్ , మే 23 ప్రజాజ్యోతి** తెలంగాణ వ్యాప్తంగా జరుగుతున్న ఓటరు జాబితా సవరణకు సంబంధించి ఎన్నికల కమీషన్ చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(సర్) ప్రక్రియకు భద్రాచలం ఓటర్లందరూ సహకరించాలని భద్రాచలం తహసీల్దారు దనియాల వెంకటేశ్వర్లు అన్నారు. భద్రాచలంలోని ఐటీడీఏ వెనుక రోడ్డులో 8వ వార్డు సభ్యురాలు పెద్దినేని లక్ష్మి ఆధ్వర్యంలో పాకాల దుర్గాప్రసాద్ ఇంటి ఆవరణలో జరిగిన సమావేశంలో సర్ ప్రక్రియ అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. 2002 తరువాత దేశంలో చేపడుతున్న ఓటరు జాబితా సవరణ, మార్పులు చేర్పుల్లో భాగంగా ప్రతి ఓటరు కార్డును తనిఖీ చేయడం జరుగుతుందని, సర్ నిబంధనలకు అనుగుణంగా స్థానికతను నిరూపించే ఆధారాలను సమర్పించాలని అన్నారు. భద్రాచలంలో ఓటు హక్కు ఉండి ఇతర ప్రాంతాల్లో ఉండే వారు సైతం వారి కుటుంబ సభ్యుల ద్వారా ఆధారాలను సమర్పించాలని అన్నారు. ప్రస్తుత ఓటర్లందరూ 2002లో ఓటరు జాబితాలో ఉన్న వారి పేర్లతో తమ కుటుంబీల పేర్లతో మ్యాపింగ్ ప్రక్రియ జరుగుతుందని, ఇందులో ఇబ్బందులు ఏర్పడిన వారు తమ స్థానికతకు తగిన ఆధారాలను సమర్పించాలని కోరారు. అలాగే రెండు ఓట్లు కలిగిన వారి పేర్లను నోటీసులు ఇచ్చి తొలగించడం జరుగుతుందని అన్నారు. అక్టోబరు నెల వరకు వివిధ దశల్లో జరిగే సర్ ప్రక్రియకు ప్రతి ఓటరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ కీర్తి, 10వ వార్డు సభ్యులు నిట్టా రాజు, కాంగ్రెస్ నాయకులు పెద్దినేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన పంచాయతీ కార్యదర్శుల బదిలీలు



**కొత్తగూడెం కలెక్టరేట్, మే 23,(ప్రజా జ్యోతి)** జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశాల మేరకు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ,జిల్లా పంచాయతీ అధికారి విద్యాచందన అధ్వర్యంలో శనివారం జిల్లాలోని పంచాయతీ కార్యదర్శుల సాదారణ బదిలీలు ప్రశాంతంగా ముగుసినవి, ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ విద్యాచందన మాట్లాడుతూ బదిలీలలో మొత్తం 131 మంది దరఖాస్తు చేసుకోగా ,వారిలో గ్రేడ్ –1 కార్యదర్శులు ఇద్దరు, గ్రేడ్ –2 కార్యదర్శులు నలుగురు, గ్రేడ్ –3 కార్యదర్శులు నలుగురు, గ్రేడ్–4 కార్యదర్శులు 121 మందికి మొత్తంగా 131 మంది కార్యదర్శులను వారు కోరుకున్న స్థానాలకు బదిలీ చేసినట్లు ఆమె తెలిపారు, ఈ కార్యక్రమంలో డివిజనల్ పంచాయతీ అధికారి సుదీర్ కుమార్, డిఆర్డిఏ ఏపీవో శ్రీనివాస రావు, ఏపీ డి రమణారావు, ఏవి ఓ కుమార్, జిల్లా పంచాయతీ కార్యాలయ సిబ్బంది విజయ్,విక్రమ్,ఫరూక్, దుర్గా ప్రసాద్, కార్యదర్శుల సంఘ భాద్యులు వంశీ, సతీష్ ,కిరణ్ తదితరలు పాల్గొన్నారు,